
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



11 నుంచి ఇంద్రధనుష్

ఈనెల 11 నుంచి వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం రెండో విడత 'మిషన్ ఇంద్రధనుష్' నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ తెలిపారు. -10లో▸



అమ్మవార్లకు శ్రావణ పూజలు

వరంగల్ నగరంలోని పలు దేవాలయాల్లో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా అమ్మవార్లను లక్ష్మీదేవిగా అలంకరించారు. -10లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దర్గా ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన



కాజీపేట రూరల్: హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను పోలీసు అధికారులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు, ముస్లిం మత పెద్దలు శుక్రవారం పరిశీలించారు. కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలను ఈనెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా తెలిపారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, కాజీపేట ట్రాఫిక్ ఏసీపీ బోజరాజు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.రషీద్, కాజీపేట సీఐ సార్ల రాజు, ఎస్‌ఐలు రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దర్గాకు చేరుకుని పీఠాధిపతితో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీపీ డేవిడ్ రాజ్ తెలిపారు. కార్యక్రమంలో భక్తియార్ బియాబాని, మత పెద్దలు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో అధికారుల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ.. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో కె.సూర్యప్రసాద్ సీసీఎస్ నుంచి మహిళా పోలీస్‌స్టేషన్ 1, ఎండీ ఉస్మాన్ షరీఫ్ వీఆర్ నుంచి ఎస్‌బీ, ఓ.రమేశ్ వీఆర్ నుంచి ఎస్‌బీకి బదిలీ అయ్యారు. సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో ఎన్.కృష్ణవేణి మామునూరు నుంచి కాజీపేట, ఎం.రమేశ్ పరకాల నుంచి కాజీపేట, జి.వెంకన్న ఇంతేజార్‌గంజ్ నుంచి మిల్స్‌కాలనీ, బి.హరికృష్ణ స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మిల్స్ కాలనీ, ఎండీ తాజ్‌మహ్మద్ కాజీపేట నుంచి వీఆర్‌కు బదిలీ చేస్తూ సీపీ ఏవీ.రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా పని చేద్దాం




హన్మకొండ అర్బన్: పిల్లలకు సరైన పోషకాహారం అందిస్తూ.. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సంక్షేమాధికారి జి.మధురిమ అన్నారు. పోషణ మాసం సందర్భంగా శుక్రవారం హనుమకొండ కాళోజీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మధురిమ మాట్లాడుతూ.. ఈనెల మొత్తం పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యం, పౌష్టికాహారం విషయంలో అవగాహన కోసం ఈకార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఆర్నెల్లలోపు పిల్లలకు తల్లిపాలే ఇవ్వాలని యుక్త వయస్సు బాలికలు, గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. బలహీనంగా ఉన్నవారిని న్యూట్రిషన్ రిహబిలిటేషన్ కేంద్రాలకు పంపించాలన్నారు. అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. డెమో వి.అశోక్‌రెడ్డి పోషణ అభియాన్ కో–ఆర్డినేటర్, సుమలత, ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, కళ్యాణి, రాజ్యలక్ష్మి, వనజ, కవిత, రమ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



విద్యారణ్యపురి: విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతన స్కేలు అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏకశిల పార్కు వద్ద వరంగల్, హనుమకొండ జిల్లాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని టీపీటీఎఫ్ నాయకులతో కలిసి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈకార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, పూర్వ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మొగిలిచర్ల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శశిధర్, ప్రధాన కార్యదర్శి స్వాతి, శ్రీధర్‌గౌడ్ పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజాకవి కాళోజీ నారాయణరావు (ఫైల్)

కలకాలం గుర్తుండేలా..

చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'ప్రజాకవి కాళోజీ' బయోపిక్

అరెస్టులకు వెరవక.. నిర్బంధాలకు జడవక.. అక్షర తూటాలను వదిలిన చైతన్య భావకుడు ప్రజాకవి కాళోజీ నారాయణరావు. ప్రజల నాల్కల మీద ఆయన కవిత్వం ఎల్లకాలం నర్తిస్తూనే ఉంటుంది. వాడుక భాషను భుజానికెత్తుకున్న ఆయన ప్రస్థానం తరాలు మారినా పదిలమే. ఆయన ఖ్యాతిని మరింత విస్తరించేందుకు.. అణచివేతకు గురైన వారిలో స్ఫూర్తి నింపేందుకు కాళోజీ జీవితాన్ని దృశ్యరూపకం చేసేందుకు నడుం బిగించారు వరంగల్‌కు చెందిన సినీ దర్శకుడు డాక్టర్ ప్రభాకర్ జైనీ. నేడు(శనివారం) కాళోజీ జయంతి సందర్భంగా విడుదలకు సిద్ధంగా ఉన్న 'ప్రజా కవి కాళోజీ' బయోపిక్ వెనుక ఉన్న నేపథ్యం.. సినిమా చిత్రీకరణ విశేషాలను దర్శకుడు ప్రభాకర్‌జైనీ శుక్రవారం 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- వరంగల్ డెస్క్

- జీవిత విశేషాలతో చిత్ర రూపకల్పన..
- నేటివిటీ దెబ్బతినకుండా అన్ని జాగ్రత్తలు..
- ప్రతి అంశాన్ని ఉండేలా చూసుకున్నాం
- 'సాక్షి'తో సినీ దర్శకుడు డాక్టర్ ప్రభాకర్ జైనీ

కాళోజీ నారాయణరావుపై ప్రసంగించాలని 2019లో ముంబై ఆంధ్ర మహాసభ నుంచి నాకు ఆహ్వానం అందింది. ప్రసంగం అనంతరం 'అంత గొప్ప కవి గురించి ప్రపంచమంతటికీ తెలియాల్సిన అవసరం ఉంది. పుస్తకాలు.. రచనల మాధ్యమంగా ఎక్కువ మందికి చేరకపోవచ్చు. ఆయన గొప్పతనాన్ని సినిమాగా తీస్తే బాగుంటుంది' అని వక్తలు అన్నారు. అప్పుడే కాళోజీపై సినిమా తీయాలనుకున్నా. అక్కడి నుంచి వచ్చాక కాళోజీ కుటుంబ సభ్యులు, ఆయనతో అనుబంధం ఉన్న వందల మందిని కలిశా. అందరి నుంచి సేకరించిన వివరాల అనంతరం దాదాపు 10 సినిమాలు తీసే కథ దొరికింది. ఆ తర్వాత కథ అక్షర రూపమైంది. ఆవెంటనే చిత్రీకరణ మొదలైంది.

అచ్చుగుద్దినట్లు..

ప్రజాకవి కాళోజీ నారాయణరావు కవిత్వం, పోరాట పటిమను కీలకాంశంగా తీసుకుని ఆయన పెరిగిన వాతావరణం, కుటుంబం, విద్యాభ్యాసం, స్నేహితులు, ఉద్యమ నేపథ్యం, సాహిత్యం, ప్రజా ఉద్యమాలు.. ఇలా.. జననం నుంచి మరణం వరకు బయోపిక్‌లో చూపిస్తున్నాం. కాళోజీ నారాయణరావు పాత్రకు యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన అశోక్‌రెడ్డి(మూల విరాట్) ప్రాణం పోశారు. కుటుంబ సభ్యులు, స్నేహితులుగా కరీంనగర్, వరంగల్‌కు చెందిన కళాకారులు ఈచిత్రంలో కీలక పాత్రలు పోషించారు. మిత్ర మండలి సమావేశాలు. నక్సలైట్లతో కాళోజీకి ఉన్న చనువు. దొరల అకృత్యాలను ఎండగట్టే తీరు. వాడుక భాషకు ప్రాణం పోసే రచనలు సినిమాలో ఉంటాయి.



ప్రభాకర్ జైనీ

మన కవి.. మన ప్రాంతం

సినిమా షూటింగ్ దాదాపు ఉమ్మడి జిల్లాలోనే పూర్తయ్యింది. కాళన్న చదువుకున్న మడికొండ, హనుమకొండ ప్రాంతం, తిరిగిన పరిసరాలు, దొరల గడీలు, బొడ్రాయి సన్నివేశాలన్నీ వరంగల్ పరిసర ప్రాంతాల్లోనే చిత్రీకరించాం. సినిమాలో ఎక్కువ మంది ఇక్కడి కళాకారులు, కవులు కనిపిస్తారు. ఈచిత్రంతో మరోసారి ఓరుగల్లు కీర్తి ప్రపంచాన్ని చేరనుందని నమ్ముతున్నా.

మావోల చెరలో ఎమ్మెల్యే.. విడిపించిన కాళోజీ

సినిమాలో మావోయిస్టులతో ఉన్న పరిచయాలను సైతం తెరకెక్కించాను. ఇందులో ఒక ఎపిసోడ్ ఎంతో ఉత్కంఠగా ఉంటుంది. శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్యే బాలరాజును మావోలు కిడ్నాప్ చేస్తే.. ఆయనను విడిపించడానికి అప్పటి పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. కానీ వాళ్ల తరం కాలేదు. చివరికి వారు కాళోజీని ఆశ్రయించారు. ఆయన మావోయిస్టులతో మాట్లాడి పోలీసుల చెరలో ఉన్న మావోయిస్టు రణదివేను వదిలిపెట్టి ఎమ్మెల్యేను విడిపించారు. ఈ సన్నివేశాలను సహజసిద్ధంగా ఉండేలా చూసుకున్నాం.

నాకు అవార్డిస్తే బద్నాం అయితవ్..

'సంధులు రావు. సమాసాలు రావు అని అందరూ నన్ను విమర్శిస్తున్నారు. నాకు పద్మవిభూషణ్ అవార్డు ఇస్తే.. నువ్వు బద్నాం అయితవ్' అని ప్రధాని పీవీ నర్సింహారావును కాళోజీ ప్రశ్నించారు. కానీ.. 'నీ విద్వత్తు యావత్ దేశానికి తెలుసు. ఎవరో విమర్శిస్తే నీకెందుకు. ఎవరు అడిగినా నేను సమాధానం చెప్తా' అని పీవీ నర్సింహారావు అన్నారు. ఈ సన్నివేశాన్ని కూడా సినిమాలో పెట్టాం.

కార్యాచరణ.. కవిత

- సామాన్య ప్రజల బాధలు, గాథలు కలలు, కన్నీళ్లే నా గొడవ కావ్యం
- నేడు కాళోజీ జయంతి

సారీ కాళన్నా..

- ఈఏడాది కూడా పూర్తికాని కాళోజీ కళాక్షేత్రం..
- పనులు పూర్తవకపోవడం వల్లే కేటీఆర్ పర్యటన రద్దు..

- వివరాలు 10లో▸

గుడ్డ సంచి.. చేతికర్ర

కాళన్న జీవితం ఆచరణీయం

ఎంతో మంది మేధావులకు గురువు.. ఆయన జీవితం సాధారణం.. జోలె సంచి.. చేతికర్ర.. పెరిగిన గడ్డం.. అందులోనే మహత్యం.. అందుకే ఆయనంటే అందరికీ గౌరవం.. సమాజ మార్పు కోసమే ఆయన 'గొడవ'. అంతటి మహనీయుడి అవార్డు నాకు రావడం గర్వంగా ఉంది. ఇది అవార్డు కాదు.. ఆయనను అనుసరించమని చెప్పిన సందేశంగా భావిస్తా' అని అంటున్నారు ప్రముఖ కవి, కాళోజీ నారాయణరావు అవార్డు గ్రహీత, వాగ్గేయకారుడు జయరాజ్. శనివారం కాళోజీ అవార్డు అందుకుంటున్న సందర్భంగా జయరాజ్ శుక్రవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- సాక్షి, మహబూబాబాద్

- పాటకు స్ఫూర్తినిచ్చిన గద్దర్
- కాళోజీ అవార్డు వచ్చినందుకు సంతోషం
- జీవితాంతం ఆయనను అనుసరిస్తా..
- 'సాక్షి'తో కాళోజీ అవార్డు గ్రహీత, ప్రజాకవి జయరాజ్

అన్యాయం జరిగితే ప్రశ్నించే అలవాటే పాటైంది.

మాది నిరుపేద కుటుంబం. పాటలు, పాఠం ఎవరి దగ్గరా నేర్చుకోలేదు. బడిలేని సమయంలో పొలంగట్లు.. మొక్కజొన్న మంచెలపై అయ్యతో పోయిన సందర్భంలో పాటలు పాడడం అలవాటైంది. ఆతర్వాత గద్దర్ పాటలు విని ఆయనలా పాడాలనే కోరిక కలిగేది. అలా పాటలు పాడాను. కళ్లముందే ఎక్కువ కులం.. ఉన్నవారు.. లేని వారు అన్న విధంగా ఎన్నో అవమానాలు.. అవహేళనలు చూశాను. అదేవిధంగా చిన్నప్పటి నుంచి వామపక్ష భావజాలంతో పెరిగా. పాఠశాలలో, ఇంటర్ కళాశాలలో నేను విద్యార్థి సంఘం నాయకుడిని. తర్వాత సింగరేణిలో కార్మిక సంఘం నాయకుడిని. అప్పటి నుంచే అన్యాయం జరిగితే ప్రశ్నించడం అలవాటైంది. అదే పాటైంది. కవితైంది.. జీవితమైంది..

గద్దర్ గతుకు బతుకుల చైతన్య దీపిక

గద్దర్ అంటే పాటకాదు.. గతుకు బతుకుల చైతన్య దీపిక.. ఆయనను ఇష్టపడని తెలుగు వారు చాలా తక్కువ మంది ఉంటారు. చిన్నతనంలో ఆయన పాటలు క్యాసెట్లు వేసుకొని వినే వాడిని. తొలుత 'లాల్‌సలాం.. లాల్ సలాం.. లాల్ లాల్ సలాం.. అంటూ అమర వీరుల గురించి పాడిన పాట అంటే ఎంతో ఇష్టం.. సిరిమల్లె చెట్టుకింద లచ్చువమ్మో.. నీవు చిన్నబోయి కూర్చున్నవెందు కమ్మో.. అనే పాట మా అమ్మకు. మా అక్కాచెల్లెండ్లకు ఆపాదించుకొని వినేవాడిని.. తర్వాత ఆయనతో కలిసి తెలంగాణ ధూం.. ధాం.. కార్యక్రమంలో సంవత్సరాల తరబడి ప్రయాణం చేశా. ఎన్నో విషయాలు నేర్చుకున్నా.

చూడగానే గురువులా కనిపించేవారు

కాళోజీని చూస్తేనే ఓ గురువు కన్పిస్తారు. ఆయన అందరికీ ఆదర్శనీయులు. ఆయన మార్గం ఆచరణీయం.. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ వాలిపోయేవారు. అందులో భాగంగా ఖమ్మం జిల్లా కాచనపల్లిలో ఐదుగురు ఎన్‌కౌంటర్ జరిగిన నేపథ్యంలో నేను 'ఎక్కాడున్నారో.. అన్నలు ఏమైపోయారో.. ' అనే పాట రాశాను. నాతోపాటు ఇతర కళాకారులు రాసిన పాటల సీడీ ఆవిష్కరణకు కాళోజీ వచ్చారు. అప్పుడే ఆయనతో నేరుగా మాట్లాడే అవకాశం వచ్చింది. అంతటి మహనీయుడితో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం, ఆయన నన్ను అభినందించిన విషయం ఇప్పటికీ మరిచిపోలేను. అదో తీపి అనుభూతిగా ఉంటుంది.

కాళోజీ అవార్డు నాకు ఆభరణం కాదు.. ఆయన ఇచ్చిన సందేశం

అణచివేతకు వ్యతిరేకంగా పోరాడమని చెప్పే పుస్తకం కాళోజీ. గతుకు బతుకులకు చెప్పే కాలేజీ కాళోజీ.. అంతగొప్ప వారి పేరున ఉన్న అవార్డుకు నన్ను ఎంపిక చేసినందుకు ముందుగా నిర్వాహక కమిటీకి కృతజ్ఞతలు. ఈఅవార్డు నాకు ఆభరణం కాదు.. నేను ఆయన మార్గం అనుసరించాలని చెప్పే సందేశంగా భావిస్తా. చేతిలో కర్ర, జోలె సంచి.. ఎంత సాధారణంగా ఉంటారో.. అదే నాకు నచ్చింది.. ఆయన కోరుకున్న విధంగా.. ప్రజల గొంతుకగా పాటలు రాస్తా.. ప్రశ్నించే గొంతుకనై పాడతా.. ప్రకృతి. సామాజిక జీవనం, ఆకలి, పేదరికం లేని సమాజం ఏర్పాటు నిర్మాణంలో పాటుపడుతా.. కుల, మత, లింగ భేదం లేని సమాజ నిర్మాణానికి కృషి చేస్తా.



జయరాజ్

బీజేపీ టికెట్ దక్కేదెవరికో?

రోజురోజుకూ పెరుగుతున్న ఆశావహులు

- ఉమ్మడి వరంగల్ నుంచి ఇప్పటికే 59మంది దరఖాస్తు
- వరంగల్ తూర్పు, పశ్చిమ, ములుగు, జనగామ నుంచి అత్యధికం
- ఈ నెల 10న ముగియనున్న దరఖాస్తు గడువు
- అసెంబ్లీ ఎన్నికల రేసులో నిలిచేందుకు పోటాపోటీ

సాక్షిప్రతినిధి, వరంగల్: కమలనాథులు కదనకుతూహలంతో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహపడుతున్నారు. బీజేపీ అధిష్టానం ప్రకటన మేరకు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పోటాపోటీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. దరఖాస్తులకు గడువు ఈ నెల 10న ముగియనుండగా.. ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే బీఆర్ఎస్ 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక కాంగ్రెస్ నుంచి సుమారు 100 మందికి పైగా 12 నియోజకవర్గాల నుంచి ఆశావహులు దరఖాస్తు చేసుకోగా అధిష్టానం అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. భారతీయ జనతా పార్టీ సైతం అభ్యర్థులను ఖరారు చేసే పనిలో భాగంగా దరఖాస్తులను స్వీకరిస్తుండగా.. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటివరకు 59 మంది ఆశావహులు తమ దరఖాస్తులను సమర్పించారు.

ప్రయత్నం చేద్దాం.. టికెట్ పట్టేద్దాం..

ఉమ్మడి జిల్లాలో రాజకీయాలకు అంటీముట్టనట్లున్న డాక్టర్లు, కాంట్రాక్టర్లు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీనుంచి పోటీ చేసేందుకు తహతహలాడుతున్నారు. ఎలాగైనా ఈసారి టికెట్ పట్టాలనే సీనియర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. సెప్టెంబర్ 17 తర్వాత అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసే క్రమంలో దరఖాస్తులను ఆహ్వానించగా.. ఇప్పటికే 59 మంది తమ పేర్లను అధిష్టానానికి అందజేశారు. ఈ నెల 10 వరకు గడువు ఉండడంతో ఈ రోజు, రేపు దరఖాస్తులు సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకు వరంగల్ పశ్చిమ, తూర్పు, ములుగు, జనగామ నుంచి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. వారిలో ముఖ్యుల వివరాలు ఇలా ఉన్నాయి..



వరంగల్ పశ్చిమ నియోజకవర్గం టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి

- వరంగల్ తూర్పు నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీశ్, గంట రవికుమార్, వన్నాల వెంకటరమణ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికిన మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, రావు పద్మ పోటీ ప్రయత్నాల్లో ఉన్నారు.
- ములుగు నుంచి ఇప్పటికే అజ్మీరా కృష్ణవేణి నాయక్, భూక్యా జవహర్‌లాల్, తాటి కృష్ణ, రాజు నాయక్, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ దేవ్ సింగ్ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ తనయుడు అజ్మీరా ప్రహ్లాద్ బీజేపీలో చేరి టికెట్ అడుగుతారన్న ప్రచారం ఉంది.

తొలి జాబితాలో చోటెవ్వరికి..

ఓ వైపు దరఖాస్తుల ప్రక్రియ సాగుతుండగా, మరోవైపు తొలి జాబితాలో ఎవరికి చోటు దక్కుతుందోనన్న ఉత్కంఠ ఆశావహుల్లో కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి శుక్రవారం నాటికి దరఖాస్తు చేసుకున్న సీనియర్లు, ద్వితీయ శ్రేణి నేతలు హైదరాబాద్, ఢిల్లీలో పైరవీలు మొదలుపెట్టారన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. పార్టీ అధిష్టానం మాత్రం ఈ నెల 17వ తేదీ తర్వాత తొలి జాబితా విడుదల చేసే దిశగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ పార్టీ త్వరలోనే వెల్లడించనుంది. ఈ క్రమంలో టికెట్ హామీపై పార్టీలో చేర్చుకున్న స్థానాల్లోని సీనియర్లు, నాయకులను మినహాయించి మిగతా చోట్ల ఆ రెండు పార్టీల అభ్యర్థులను ఢీకొట్టే ఆర్థికంగా, సామాజికంగా బలమున్న నేతలకు చాన్స్ ఇవ్వనుందన్న చర్చ కూడా పార్టీవర్గాల్లో సాగుతోంది.

- జనగామకు ఆరుట్ల దశమంతరెడ్డి, ముక్కెర తిరుపతిరెడ్డి, బేజాడి బీరప్ప, గాడిపల్లి ప్రేమలతా రెడ్డి తదితరులు టికెట్ రేసులో ఉన్నారు.
- స్టేషన్ ఘన్‌పూర్ నుంచి మాజీ మంత్రి డాక్టర్ జి.విజయ రామారావు, మాదాసు వెంకటేశ్, బొజ్జపల్లి సుభాశ్ తమ పేర్లను అధిష్టానానికి అందజేశారు.
- భూపాలపల్లి నుంచి చందుపట్ల కీర్తిరెడ్డి, కటంగూరి రాంనర్సింహారెడ్డి, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల నుంచి మాజీ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కొండేటి శ్రీధర్ దరఖాస్తు చేసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.
- మహబూబాబాద్ నుంచి జాటోత్ హుస్సేన్ నాయక్ ఉండగా యాప సీతయ్య, యల్డి నాగలక్ష్మి టికెట్ అడుగుతున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ జిల్లాలోని కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా ఒకే రోజు లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే వివిధ కోర్టుల్లో పెండింగ్ ఉన్న కేసులను గుర్తించారు. రాజీపడే అవకాశం ఉన్న కక్షిదారులకు నోటీసులు జారీ చేశారు. వరంగల్ జిల్లాలో 3,500 కేసులు, హనుమకొండ జిల్లాలో 4 వేల కేసులు పరిష్కారమే లక్ష్యంగా పెట్టుకున్నారు. క్రిమినల్, సివిల్, భూ సంబంధ, కుటుంబ తగాదాలు, ఆస్తి పంపకాలు, ప్రమాద నష్ట పరిహారానికి సంబంధించి కోర్టులో పెండింగ్ ఉన్న కేసులు వరంగల్ జిల్లాలో 576, హనుమకొండ జిల్లాలో 519 కేసులను గుర్తించారు. జాతీయ లోక్ అదాలత్‌కు న్యాయమూర్తులు, న్యాయవాదులకు వేర్వేరుగా ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేశారు. వరంగల్ 7, నర్సంపేట 2, హనుమకొండలో పరకాల 1 బెంచ్ ఏర్పాటు చేసినట్లు న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించండి

చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ రిజ్వాన్ బాషా, 'కుడా' చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కాళోజీ చరిత్రను తెలిపేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు నిర్వహించాలని సూచించారు. కాళోజీ చిత్రమాలికలతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. కాళోజీ నారాయణరావు అవార్డు అందజేత కార్యక్రమాన్ని అన్ని హంగులతో నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ హాజరుకానున్నట్లు వివరించారు. సమావేశంలో కాళోజీ ఫౌండేషన్ సభ్యులు అంపశయ్య నవీన్, వీఆర్.విద్యార్థి, అశోక్, పొట్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్


కార్యక్రమాలు ఇలా..

శనివారం ఉదయం 10.30 గంటలకు హనుమకొండలోని కాళోజీ నారాయణరావు విగ్రహం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు నివాళి అర్పిస్తారు. హరిత కాకతీయ హోటల్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తారు. సాయంత్రం 5.10 నుంచి 7.30 వరకు 'నా ప్రపంచం–నాకలలు' నాటక ప్రదర్శన, 5.10 నుంచి 5.25 వరకు రుద్రమదేవి కూచిపూడి నృత్యం, 5.25 గంటలకు జయంతి కార్యక్రమం, అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది.

ఎన్నికల్లో ధన, మద్య ప్రవాహాన్ని అడ్డుకోవాలి

కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: రానున్న ఎన్నికల్లో జిల్లాలో అక్రమ ధన, మద్య ప్రవాహాన్ని అడ్డుకోవడానికి యంత్రాంగం అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల నిర్వహణలో వ్యయ పరిశీలనపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల నిర్వహణలో వ్యయ పరిశీలనపై కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య మాట్లాడుతూ.. గత అనుభవాల్ని దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్ని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఎన్నికలు విజయవంతం చేయాలని ఆదేశించారు. సీపీ ఏవీ.రంగనాథ్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. కాగా.. ఈనెల 20న మరోసారి సవేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎన్నికల అనుబంధ సంఘాల అధికారులు, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, అశ్విని తానాజీ, డీఆర్ఓ వైవీ గణేశ్, ఆర్డీఓ రమేశ్, పోలీస్ అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన సీపీ, అధికారులు

ఆరోగ్యశ్రీలో రూ.5లక్షల వరకు వైద్య సేవలు

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేసే వైద్య సేవల ఖర్చు పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల నుంచి 5 లక్షలకు పెంచినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఈ ఆరోగ్యశ్రీలో 1,672 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తారని తెలిపారు. అయితే ఆరోగ్యశ్రీ సేవలు పొందడానికి ప్రభుత్వం ఈ కేవైసీ తప్పనిసరి చేసినట్లు పేర్కొన్నారు. ఈకేవైసీ అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సీఎస్‌సీ జిల్లా మేనేజర్ పవన్ ఉన్నారు.

స్వీప్ యాక్టివిటీస్‌లో పోటీలు

వరంగల్ : స్వీప్ యాక్టివిటీస్‌లో భాగంగా ఓటర్లను చైతన్య పర్చేందుకు విద్యార్థుల సహకారం తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం వారికి పలు పోటీలను నిర్వహించి బహుమతులను అందించనున్నట్లు పేర్కొన్నారు. స్కిట్ పోటీలకు 9 నుంచి 12వ తరగతి చదువుతున్న వారు ఒక కేటగిరీ, డిగ్రీ ఆపైన చదువుతున్న వారు ఒక కేటగిరీగా నామినేషన్లు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. 9, 10వ తరగతి విద్యార్థులు తమ రచనలను స్కూల్ హెడ్‌మాస్టర్, ఇంటర్ విద్యార్థులు తమ కళాశాల ప్రిన్సిపాల్‌కు సెప్టెంబర్ 18లోపు పంపాలని కలెక్టర్ సూచించారు.

ఇండియా కూటమి హిందువులకు వ్యతిరేకమా?


- జీజేపీ నేత, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

సాక్షిప్రతినిధి, వరంగల్: ఇండియా కూటమి సనాతన ధర్మం పనికిరాదని చెబుతుందా?.. అలాగైతే ఆ కూటమి హిందువులకు వ్యతిరేకమనుకోవాలా? ఏమైనా ఉంటే స్పష్టం చేయాలని బీజేపీ సీనియర్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని వ్యతిరేకించేవారు 80 శాతం ఉన్న హిందువుల ఓట్లు అడగరా? అని నిలదీశారు. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులను పరామర్శించేందుకు శుక్రవారం హనుమకొండకు వచ్చిన రఘునందన్‌రావు ఎలక్ట్రానిక్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. జమిలి ఎన్నికల ప్రతిపాదన రాగానే భుజాలు ఎందుకు తడుముకుంటున్నారని, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో ఏమన్నా జమిలి ఎన్నికలు పెట్టొద్దని ఉందా? అని ఆయన ప్రశ్నించారు. జమిలి ఎన్నికలపై ఎన్నికల రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకుందని, గతంలో పార్లమెంట్ లో చర్చ జరిగిందని, రేపు కూడా జరుగుతుందని రఘునందన్ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఓట్ల కోసం, సీట్ల కోసం నిర్ణయాలు తీసుకోరని, జనహితం కోసం, దేశ హితం కోసం ఆయన నిర్ణయాలు ఉంటాయన్నారు. తెలంగాణ అసెంబ్లీకి జనవరి 16, 2024తో గడువు ముగుస్తుందని, మూడు నెలల ముందు నవంబర్, డిసెంబర్‌లో ఎందుకు ఎన్నికలు నిర్వహించాలని రఘునందన్ రావు ప్రశ్నించారు. జనవరిలోనే తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు పెడితే తప్పేంటన్న ఆయన తెలంగాణ ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాల్సింది భారత ఎన్నికల సంఘమని అన్నారు.

అనుమానాస్పదస్థితిలో గర్భిణి ఆత్మహత్య

కురవి: అనుమానాస్పదస్థితిలో గర్భిణి బానోత్ నవ్య(20) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కొర్లకుంట తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. తండావాసులు, పోలీసుల కథనం ప్రకారం.. కొర్లకుంట తండాకు చెందిన లకావత్ జేత్‌రాం–జ్యోతి దంపతుల కుమార్తె నవ్యను గార్ల మండలం సీతంపేటకు చెందిన బానోత్ మధుకు గత మే నెలలో ఇచ్చి వివాహం జరిపించారు. ప్రస్తుతం నవ్య నాలుగు నెలల గర్భిణి. గత కొన్ని నెలల క్రితం తల్లిగారింటికి వచ్చింది. భర్త మధు గత కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. గురువారం సాయంత్రం మధు అత్తగారింటికి వచ్చాడు. అదే రాత్రి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. శుక్రవారం మధ్యాహ్నం సైతం భార్యభర్తల మధ్య గొడవ జరిగినట్లు తండాలో చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలోనే నవ్య ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉరివేసుకుని చనిపోయిన విషయాన్ని తాత చూసి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే ఈ విషయాన్ని కుటుంబసభ్యులు సీరోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న భర్త మధు తండాకు వచ్చాడు. సీరోలు ఎస్సై రమాదేవి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పంచనామా చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై రమాదేవి తెలిపారు. అయితే భర్త మధుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసుల విచారణలో ఏం తెలుతుందో వేచి చూడాల్సిందే.

కార్యాచరణ.. కవిత



- సామాన్య ప్రజల బాధలు, గాథలు కలలు, కన్నీళ్లే నా గొడవ కావ్యం
- సందర్భానుసారం కవితలతో ప్రశ్నించిన గొప్ప వ్యక్తి
- ముక్కుసూటి తనం.. ఆయన వ్యక్తిత్వం
- నేడు కాళోజీ జయంతి

హన్మకొండ కల్చరల్ : కాళోజీ వంటి ప్రజాస్వామ్య విలువలు బోధించిన ప్రజాస్వామిక ప్రవక్త. 'అన్యాయాన్ని ఎదిరించినవాడు నాకు ఆరాధ్యుడు' అన్న కాళోజీ ఎక్కడ ఉన్నా ఆయన కవితలు ప్రజలతో మాట్లాడుతున్నట్లుగానే ఉండేవి. కాళోజీ జీవితం నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, తెలంగాణతో ముడిపడి ఉంది. తన ఉద్యమ కార్యాచరణలో స్పందించే అవసరం ఏర్పడినప్పుడు కాళోజీ తన కవితల ద్వారా విజృంభించాడు. సామాన్య ప్రజల బాధల్ని, గాథల్ని కలల్ని, కన్నీళ్లను నా గొడవ కావ్యంగా మలిచారు. సందర్భాన్ని అనుసరించి ఆయన కవితలు సాగేవి. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.


1914 సెప్టెంబర్ 9వ తేదీన రంగారావు – రమబాయి దంపతులకు కాళోజీ జన్మించారు. ఆయన అసలు పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ. మడికొండలో ప్రాథమిక విద్య, హనుమకొండ, హైదరాబాద్‌లలో ఉన్నతవిద్య అభ్యసించారు. కాళోజీ సోదరుడు రామేశ్వరరావు ఉర్దూ సాహిత్యంలో గొప్ప కవి షాద్ కలంపేరుతో రచనలు చేసేది. రామేశ్వరరావును పెద్ద కాళోజీగా పిలిస్తే, నారాయణరావును చిన్నకాళోజీగా పిలిచేవారు. కాళోజీ 15సంవత్సరాల వయస్సు నుంచే రాజకీయ ఉద్యమాల్లో, కవిత, రచనా వ్యాసంగాల్లో మునిగిపోయారు. ఆర్యసమాజం, ఆంధ్ర మహాసభ, నిజాం స్టేట్ కాంగ్రెస్‌లో ఉంటూ నైజాం వ్యతిరేక పోరాటంలో పనిచేశారు.

కార్యాచరణకు తోడుగా కవితలతో విజృంభణ

సుదీర్ఘకాలంపాటు అప్పటి పరిస్థితులు, దౌర్జన్యాలు, వ్యక్తులను ఎండగడుతూ కవిత్వం రాసిన వ్యక్తి కాళోజీ. తన ఉద్యమ కార్యాచరణలో స్పందించే అవసరం ఏర్పడినప్పుడు తన కవితల ద్వారా విజృంభించాడు. నిక్కచ్చిగా ప్రశ్నించాడు. అందుకే కాళోజీ ఈనాటికి భౌతికంగా లేకున్నా.. ఆయన కవితలు ప్రజలతో మాట్లాడుతున్నట్లుగానే ఉంటాయి. ఆయనకు ముక్కుసూటి తనం ఎక్కువని ఇప్పటికీ ఆయన సన్నిహితులు చెబుతుంటారు. ఏదైనా నచ్చకపోతే వెంటనే ముఖంమీద చెప్పేవారని అంటుంటున్నారు.

లేఖా సాహిత్యంలోనే గొప్ప కవిత

1946లో వరంగల్ కోటలో మొగిలయ్య హత్య జరిగింది. మరొకచోట పసిబాలుడిని పొడిచారు. చంపిన వారికి శిక్ష వేయాల్సిందిపోయి జెండా ఎగురేసిన వారినే శిక్షించారు. కాళోజీకి కూడా ఆరునెలల పాటు నగర బహిష్కరణ శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఇక్కడి సంఘటనలపై విచారణ చేయాడానికి వచ్చిన ప్రధాని మీర్జా ఇస్మాయిల్‌ను కాళోజీ తన కవిత ద్వారా ప్రశ్నించారు. 'ఎన్నాళ్ల నుండియో ఇదిగో అదిగో అనుచూ / ఈనాటికైనను ఏగివచ్చితివా? / కోట గోడల మధ్య ఖూనీ జరిగిన చోట/ గుండాల గుర్తులు గోచరించినవా/ బాజారులో బాలకుని బల్లెంబుతో పోడుచు/ బద్మాషునేమైనా పనిబట్టినావా/ మొగిలయ్య భార్యతో, మొగిలయ్య తల్లితో /మొగమాటము లేక ముచ్చటించితివా?/ కాలానుగుణ్యమగు కాళోజీ ప్రశ్నలకు / కన్నులెర్రగా చేసి ఖామూషి అంటావా?... ' అంటూ ప్రశ్నించారు. ఇది ఇంగ్లిష్‌లో వార్డు బెస్టరు ఫీల్డ్‌కు డాక్టర్ జాన్సన్ రాసిన లేఖ వంటిదని, ఇప్పటికి లేఖ సాహిత్యంలో ఉత్తమశ్రేణికి చెందిందిగా గుర్తిస్తారు.



పద్మవిభూషణ్ అవార్డు అందుకుంటున్న కాళోజీ నారాయణరావు (ఫైల్)

సందర్భానుసారం కాళోజీ కవితలు

సందర్భం : 1947లో 3నెలల నగర బహిష్కరణ శిక్ష ముగిసిన తర్వాత వరంగల్‌కు వచ్చినప్పుడు

స్టేటు కాంగ్రెసు లక్ష్యసిద్ధికై మనకు/మొగలయ్య చూపిన ముల్యమే పథము/శాంతిదూతల మనుచు చాలెంజీచేయ.../ నిందమోహిన వాడే నిందితుగుకాగా/మా వూరికే మేము మరలివచ్చితిమి/ మూడు నెల్లాకాంక్ష ముండమోసినది/ వెళ్లగొట్టిన వెధవె వెళ్లిపోయినాడు.

సందర్భం: 1966లో వరంగల్లులో ఆంధ్రప్రదేశ్ కవులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా కాళోజీని సన్మానించినప్పుడు..

నా గొడవ

నా గొడవనునది/కాళోజీ అనునది/నా గొడవనునది/వాగుడు అనుపించునది/ఎడతెగని వాగుడది/ఎడతెగక సాగునది/అక్షరజీవన మనునది/ నా గోడవనుది ..../ కాలమునకే కాదు మహా/కాలునకును ఏనాడును/ జీ అనని కలేజాతో/కాళోజీ అనునది/నా గొడవనునది...

సందర్భం: 1969లో కుటుంబ నియంత్రణపై జరిగిన కవి సమ్మేళనంలో..

ప్రకృతి సిద్ధ ధర్మానికి/ ప్రతికూలము కాని నడక/ సతీపతుల సౌఖ్యానికి/సంకటము లేని నడక../పుట్టేవారి పొట్టకు బట్టకు/దిట్టమైన ఏర్పాట్లు ఏవియును/కల్పించక, కనించుట, కనుట/కసాయితనము, పిశాచి పూనము..

సందర్భం : 1969 మే 1న వరంగల్‌లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సందర్భంగా జరిగిన ప్రజాసమితి సదస్సులో చదివిన కవిత..

దోపిడీ చేసే ప్రాంతేతరులను/దూరం దాకా తన్ని తరుముతం/ ప్రాంతం వాడే దోపిడి చేస్తే/ ప్రాంతంతోనే పాతరవేస్తం/దోస్తుగ ఉండే వారితో మేమును/దోస్తే చేస్తం–ప్రాణమిస్తం/ఎవతకు అంత అన్న ధోరణితో/చింతమాని రబతుకును సాగిస్తం/ తెలంగాణమిది –తెలంగామిది/తీరాన దూరాన వున్నది/ముంచే యత్నం చేస్తే తీరం /మునుగును తానే–మునుగును తప్పక

సందర్భం: 1970లో వరంగల్‌లో నూతన గజానన మండలి యాభైవ వార్షిక మహోత్సవం సందర్భంగా రాసిన కవిత...

గణపతీ / అదృష్ట జాతకం నీది/ కన్నతల్లి సర్వ మంగళ/కన్న తండ్రి సాక్షాత్ శివుడు.../ఫలానా అబ్బాయివని /వారసత్వంగా / అధికార దక్కదు సుమా ఈ రోజుల్లో/ గణం విసిగోయింది/ఇదే అల్టిమేటం ఇస్తున్నాను/వచ్చే ఏడు/ మళ్లీ నీకు ఆహ్వానం లేదు/ ఈసారి ఉద్వాసన మాత్రమే తుదిది.

సారీ కాళన్నా...

- ఈ ఏడాది కూడా పూర్తికాని కాళోజీ కళాక్షేత్రం..
- 9 ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే..
- కేటీఆర్ ప్రారంభిస్తారని హడావిడి
- పనులు పూర్తికాకపోవడం వల్లే పర్యటన రద్దు

హన్మకొండ కల్చరల్ : 'సారీ కాళన్నా...ఈ యేడు కూడా నీ కళాక్షేత్రం చేయలేకపోతిమి' అని బాధపడుతున్నారు జిల్లా కళాకారులు, సాహితీవేత్తలు. కాళోజీ పేరిట నిర్మిస్తున్న ఆడిటోరియం స్మారకభవనాన్ని ఈ ఏడాది కూడా పూర్తి చేయలేకపోయారు. తెలంగాణ రాష్ట్రం కోసం తపించిన కాళోజీ శత జయంతి ఉత్సవాల సందర్భంగానే తెలంగాణ రాష్ట్రం రావడంతో కాళోజీని ఎంతో అభిమానించే సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కాళోజీ పేరిట రవీంద్రభారతి కంటే పెద్ద ఆడిటోరియం నిర్మించాలని నిర్ణయించాడు. 2014 సెప్టెంబర్ 9న ఆయన జయంతి సందర్భంగా కాళోజీ పేరిట హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్ పక్కన అతిపెద్ద ఆడిటోరియం నిర్మించడానికి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.50 కోట్లతో నాలుగు అంతస్తులుగా నిర్మిస్తున్న ఈ కళాక్షేత్రం అంతర్జాతీయ ప్రమాణాలతో పలు భవనాల నమూనాలను సేకరించారు. వాటిల్లో అత్యున్నతమైన భవన నిర్మాణప్లాన్‌ను ఎంపిక చేసి 4.5 ఎకరాల విస్తీర్ణంలో 1,39,823 చదరపు అడుగుల వైశ్యాలంలో ఈ కళాక్షేత్ర నిర్మాణం ప్రారంభించారు.

తెలంగాణలోనే అతిపెద్ద ఆడిటోరియం....

కాళోజీ కళాక్షేత్రం తెలంగాణలోనే అతిపెద్ద ఆడిటోరియం. పనులు ప్రారంభించి 9 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు కూడా పూర్తికాలేదు. మూడు నెలలుగా పాలకవర్గం రెండు రోజులకోసారి కళాక్షేత్రాన్ని సందర్శించి నిర్మాణపనులను పరిశీలించి సూచనలు ఇవ్వడం వరకే పరిమితమైపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాకపోవడం వల్ల నిర్మాణ పనులు ముందుకు సాగలేదన్న వాదన వినిపిస్తోంది.

50 శాతం కూడా పూర్తికాని నిర్మాణం

కళాక్షేత్ర నిర్మాణం ఇప్పటివరకు 50శాతం కూడా పూర్తికాలేదు. ఇటీవల కేటీఆర్ పర్యటించిన సమయంలో కళాక్షేత్రం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించడం.. ఆ మేరకు నిధులు విడుదల చేయడంతో కొంత పనులు వేగిరమయ్యాయి. వాస్తవానికి శనివారం కాళోజీ జయంతిని పురస్కరించుకుని మంత్రి కేటీఆర్‌తో కళాక్షేత్రాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. కొంత నాయకులు, అధికారులు హడావిడి చేశారు. కానీ అసంపూర్తి నిర్మాణాన్ని ప్రారంభోత్సవం చేస్తామనడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కేటీఆర్ పర్యటన వాయిదా పడినట్లు ప్రకటించారు.

ప్రజలను అవమానపరిచినట్టే..



అసంపూర్తిగా ఉన్న కళాక్షేత్రాన్ని ప్రారంభోత్సవం చేస్తామనడం కాళోజీని అభిమానించే ప్రజలను, కవులు, కళాకారులను అవమానపరిచినట్టే. వర్షం కారణం చెప్పి వాయిదా వేస్తున్నామనడం సిగ్గుచేటు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మేడారం జంపన్నవాగుపైన కిలోమీటర్ బ్రిడ్జిని నెల రోజుల్లో పూర్తిచేయగా లేనిది కళాక్షేత్రం పనుల్లో ఎందుకు జాప్యం? ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేసి కాళోజీ సోదరుల వర్ధంతి వరకైనా పూర్తి చేయాలని కోరుతున్నాం.

– నల్లెల్ల రాజయ్య, వరంగల్ రచయితల సంఘం అధ్యక్షుడు



అసంపూర్తిగా కాళోజీ కళాక్షేత్రం

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

హన్మకొండ: రానున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని అఖిల పక్షం డిమాండ్ చేసింది. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సీపీఐ, మహాజన సోషలిస్ట్ పార్టీతో పాటు ప్రజా, వృత్తి, కుల సంఘాల నాయకులు ఇందులో పాల్గొని ప్రసంగించారు. బీజేపీ మాదిగలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీజేపీ మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, లంబడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్, ఆయా పార్టీలు, సంఘాల నాయకులు చిర్ర రాజుగౌడ్, అంబాల చంద్రమౌళి మాదిగ, వేల్పుల సూరన్న, జన్ను దినేశ్ మాదిగ, బొచ్చు తిరుపతి మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ, రాజారపు భిక్షపతి మాదిగ, అంకిళ్ల రాజు, బొడ్డు శాంతిసాగర్, కొత్తపాక రవి, జిల్లేల మురళి, చిలువేరు సంపత్, శనిగరపు రవీందర్, చేతాల్ల శివ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న రాజకీయ, ప్రజా, వృత్తి సంఘాల నాయకులు

ఓటర్ల వివరాలు పక్కాగా ఉండాలి

- ఏఆర్‌ఓ, గ్రేటర్ కమిషనర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో ఓటర్ల వివరాలు పక్కాగా ఉండాలని ఏఆర్‌ఓ, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వరంగల్, ఖిలా వరంగల్ ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో ఓటరు జాబితాలోని అబ్సెంట్, షిఫ్టింగ్, డెత్(ఏఎస్‌డీ)లపై తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే వ్యక్తి రెండు అంతకుమించి వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదై ఉంటే ఓటరు నిర్ణయం మేరకు ఒక చోట ఉంచి.. మిగతావి తొలగించాలని సూచించారు. సమావేశంలో బల్దియా సెక్రటరీ విజయలక్ష్మి, సీఎంహెచ్‌ఓ రాజేశ్, వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వరద రాజేశ్వర్‌రావుపై అట్రాసిటి కేసు

- పల్లెనిద్ర కార్యక్రమంలో దూషించారని కాంగ్రెస్ పర్వతగిరి మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ ఫిర్యాదు

సాక్షి, వరంగల్ : వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం రసకందాయంగా మారింది. పార్టీ పర్వతగిరి మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల రోజుల తర్వాత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నమోదైంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ భర్త కావడంతో ఈ కేసుకు ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం హస్తం పార్టీలో చర్చకు దారి తీసింది. కాంగ్రెస్ నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో కులం పేరు ప్రస్తావిస్తూ దూషించినందుకు కేసు వరకు వెళ్లిందని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా, శ్రీనివాస్ నాయక్‌పై పర్వతగిరి ఠాణాలో నాలుగు రోజుల క్రితం కేసు నమోదైంది. తనను దూషించాడని దౌలత్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సాంబరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

కులప్రస్తావన తెచ్చారని..

కాంగ్రెస్ పర్వతగిరి మండల అధ్యక్షుడిగా నాలుగు సంవత్సరాల నుంచి దేవీలాల్ తండా వాసి జాటోత్ శ్రీనివాస్‌నాయక్ పనిచేస్తున్నారు. ఆగస్టు 9న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరద రాజేశ్వర్‌రావు పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా పర్వతగిరి మండలం పెద్ద తండాకు వెళ్లారు. అదే రోజున కాంగ్రెస్ నాయకుడు కేఆర్.నాగరాజు పల్లె నిద్ర కోసం గడ్డపార తండాకు వెళ్లారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో కేఆర్.నాగరాజుకు మద్దతు తెలిపేందుకు శ్రీనివాస్‌నాయక్ వెళ్లారు. 'నా దగ్గరకు రాకుండా గడ్డపార తండా కార్యక్రమానికి ఎలా పోతాడు. పార్టీ మండల అధ్యక్ష పదవి ఏ విధంగా ఉంటదో నేను చూస్తా' అంటూ కుల ప్రస్తావన తీసుకొస్తూ వరద రాజేశ్వర్‌రావు నాయకులు, సభ్యుల సమక్షంలో తిట్టారని జాటోత్ శ్రీనివాస్‌నాయక్.. జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావును కలిశారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పర్వతగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 290 ఐపీసీ, 3(1)(ఆర్)(ఎస్) ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ కింద వరద రాజేశ్వర్‌రావుపై కేసు నమోదు చేశారు.

11 నుంచి రెండో విడత ఇంద్రధనుష్

- వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గీసుకొండ : జిల్లాలో ఈ నెల 11 నుంచి 16 వరకు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం 'మిషన్ ఇంద్రధనుష్'ను నిర్వహించనున్నట్లు వరంగల్ డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మిషన్ ఇంద్రధనుష్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే ట్రెనింగ్ ఇచ్చే వారి వద్ద నివృత్తి చేసుకోవాలని, యూ–విన్ పోర్టల్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రొటీన్ ఇమ్యూనైజేషన్‌తోపాటు ఇంద్రధనుష్‌కు సంబంధించిన లబ్ధిదారుల పేర్లను యూ–విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలతో కలిసి వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పూర్తిగా వ్యాధి నిరోధక టీకాలు తీసుకోని వారిని, మధ్యలో తీసుకుని వదిలేసిన వారిని గుర్తించి మైక్రో యాక్షన్ ప్లాన్ ఈ నెల 9 లోపు జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. యూనిసెఫ్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రశాంత్ త్యాగరాజన్, డిప్యూటీ డెమోలు అనిల్‌కుమార్, నవీన్‌రాజ్‌కుమార్, హెచ్‌ఈఓ విద్యాసాగర్ రెడ్డి, స్వామి, రవీందర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

కాళోజీ సెంటర్ : జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని తెలంగాణ బహుజన సమాఖ్య (టీబీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చంటి ముదిరాజ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ డి.వాసంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల దోపిడీ అరికటాలంటే జీఓ 1 ప్రకారం ప్రతి పాఠశాలలో ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుపై పెట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్రవంతి, సారం అభిలాష్, నమిండ్ల హరీష్, సంగాల నవీన్, నాయకులు అఖిల్, మహిపాల్, బోగం సంధ్య, కళాధర్ పాల్గొన్నారు.

పీజీ విద్యార్థికి కాలిన గాయాలు

- కేఎంసీ సూపర్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స
- గుట్టుచప్పుడు కాకుండా వైద్యం



గాయపడిన ఇలాహి

ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాలలో ఆర్థోపెడిక్ పీజీ విభాగంలో రెండో సంవత్సరం విద్యనభ్యసిస్తున్న ఇలాహి అనే విద్యార్థి అనుమానాస్పదంగా కాలిన గాయాలతో ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. ఇలాహి తన స్నేహితుడితో కలిసి అద్దె నివాసంలో ఉంటాడు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో విద్యార్థి కడుపు, ఛాతిపై కాలిన గాయాలతో ఎంజీఎంలో అడ్మిట్ అయ్యాడు. అడ్మిట్ అయిన విషయాన్ని బయటకు రాకుండా ఎంజీఎం పరిపాలనాధికారులు అత్యంత గోప్యంగా మధ్యాహ్నం కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్సలు కాలోజీన్ షీట్స్ వంటి చికిత్సలు నిర్వహించారు.

గిఫ్ట్ ప్యాక్ చేస్తున్న సమయంలో గాయాలు : ప్రిన్సిపాల్ మోహన్‌దాస్

ఇలాహి కేఎంసీలోని హాస్టల్‌లో కాకుండా బయట అద్దె గదిలో నివాసముంటున్నాడు. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ప్లాస్టిక్ పేపర్‌తో బహుమతి వస్తువును క్యాండిల్ సాయంతో ప్యాకింగ్ చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో స్పిరిట్ జ్వాలతో ప్యాకింగ్ చేసే ప్రయత్నంలో అది అకస్మాత్తుగా మంటలు వ్యాపించగా పొత్తి కడుపు, ఛాతి, చేతులు తీవ్రంగా కాలిపోయాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉంది.

ఘటన వెనుక అనుమానాలెన్నో...:

కేఎంసీ ప్రిన్సిపాల్ పేర్కొన్నట్లు గిఫ్ట్ ప్యాక్ చేస్తున్న క్రమంలో ఇలాహి గాయాలు కావడం సరైంది కాదని వైద్యవర్గాలు, విద్యార్థుల్లో చర్చ జరుగుతోంది. కొంతమంది ఇలాహి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడని కొంత మంది చర్చించుకుంటున్నారు. ఎంజీఎం వైద్యులు శుక్రవారం అర్ధరాత్రి ఘటన జరిగితే సాయంత్రం శస్త్రచికిత్సలు నిర్వహించే వరకు ఎవరికీ తెలియకుండా అత్యంత గోప్యంగా ఉంచడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవార్లకు శ్రావణ శుక్రవారం పూజలు



భద్రకాళి ఆలయంలో దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు



భద్రకాళి అమ్మవారు



రాజరాజేశ్వరి అమ్మవారు

- దేవాలయాల్లో భక్తుల రద్దీ

హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి దేవాలయం, ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవాలయం, సంతోషిమాత దేవాలయం, శ్రీహనుమద్గిరి పద్మాక్షి దేవాలయాల్లో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం అమ్మవార్లను లక్ష్మీదేవిగా అలంకరించి ఘనంగా పూజలు జరిపారు. భక్తుల రద్దీతో దేవాలయాలు కిక్కిరిశాయి. ఉదయం నుంచి అర్చకులు అమ్మవార్లకు అభిషేకం, నిత్యాహ్నికం జరిపారు. వందలాది మంది భక్తులు సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒడిబాలబియ్యం సమర్పించుకున్నారు. పలు దేవాలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిగాయి.